క్లుప్తంగా

పెద్దమ్మ దేవర ఏర్పాట్లపై సమీక్ష



దేవర ఏర్పాట్లపై చర్చిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో జూన్ 8, 9, 10 నిర్వహించనున్న మూలపెద్దమ్మ దేవర ఏర్పాట్లపై శనివారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం తదితర వాటిపై చర్చించారు. వాహనాల కాకపోకలు, పార్కింగ్, ఊరి బయట ప్రత్యేక బైపాస్ రోడ్డు వేయాలని నిర్ణయించారు. దేవరను కలిసి కట్టుగా విజయవంతం చేద్దామని నిర్ణయించుకున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలతో అధికారులు

నంద్యాల(న్యూటౌన్): జీవవైవిధ్యం, సుస్థిరాభివృద్ధి అనే అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. శనివారం స్థానిక మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ప్రపంచ జీవ వైవిధ్యం దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల నుంచి వంద మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జిల్లా ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. డీఈఓ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలో జీవవైవిధ్య పరిరక్షణ అత్యంత ఆవశ్యకం అన్నారు. జనటిక్ జీవ వైవిధ్యం ద్వారా తెగుళ్లను తట్టుకొని నాణ్యత గల సుస్థిర పంటలను పండించడం సాధ్యమవుతుందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 22వ తేదీన ప్రపంచ జీవవైవిధ్యం దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేస్తారని చెప్పారు. జిల్లా సైన్స్ అధికారి, జిల్లా కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, సుందర్‌రావు, నాగేంద్రకుమార్, శేషఫణి, సుబ్బయ్య, చంద్రశేఖర్, బాపూజీనాయక్ పాల్గొన్నారు.

ఆలయాల భూములకు తగ్గిన ఆదాయం



అల్లూరులో జనార్దన స్వామి ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్న ఈఓ

ఉయ్యాలవాడ: మండలంలోని తుడుమలదిన్నె, అల్లూరు గ్రామాల్లో గణపతి, ఆంజనేయ స్వామి, జనార్ధన స్వామి, నాగేశ్వరస్వామి ఆలయాల మాన్యం భూముల వేలంపాటలు శనివారం దేవదాయ శాఖ ఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. తుడుమలదిన్నె గ్రామంలో 40 ఎకరాల భూములను కౌలుకు వేలం పాట నిర్వహించగా రూ.1.87 లక్షలకు రైతులు పాడి దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.69,500 తగ్గింది. అలాగే అల్లూరు గ్రామంలో 13 ఎకరాలను రూ.1.81 లక్షలకు రైతులు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.20 వేల ఆదాయం తగ్గినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కూలూరు రామక్రిష్టారెడ్డి, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ గోపి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

నంద్యాల(అర్బన్): తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ ఫీజు బాక్స్‌లతో ప్రమాదం పొంచి ఉందని, సమస్య పరిష్కారించాలంటూ మండలంలోని అయ్యలూరు గ్రామ ఎస్‌డీపీఐ నాయకులు హబీబుల్లా, ఉమర్‌బాషా కోరారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి శనివారం నంద్యాల మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుగుణశ్రీకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పీర్లచావిడి, గొల్లపేట, సాయివాణి స్కూల్ వద్ద ఉన్న ఫీజు బాక్స్‌లు తక్కువ ఎత్తులో ఉన్నాయన్నారు. చిన్నారులు సంచరించే ఆ ప్రాంతాల్లో ఫీజు బాక్స్‌లతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, వాటిని సరిచేయాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో జారీ

ప్యాపిలి: మండలంలోని వెంగళాంపల్లిలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్‌కు మెమో ఇచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను సోమ, మంగళ, బుధవారాల్లో ఏపీఓ శ్రీవిద్యతో పాటు టీఏలు పరిశీలించారన్నారు. అయితే సోమవారం 400 మంది కూలీలు హాజరు కాగా మంగళ, బుధవారాల్లో 275 మంది మాత్రమే పనులకు హాజరైనట్లు గుర్తించినట్లు తెలిపారు. కానీ మస్టర్లలో మాత్రం కూలీలు పనికి హాజరు కాకపోయినా హాజరైనట్లు నమోదు చేసి కూలీల నుంచి రూ.200 చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ మేరకు నోటీసు అందిన రెండు రోజుల్లో రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ఫీల్డు అసిస్టెంట్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీ'ఛీ' బస్టాండ్!

- నంద్యాల బస్టాండ్‌లో లోపించిన స్వచ్ఛత
- మూతబడిన మూత్రశాలలు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ.. బస్టాండ్ ఆవరణలో పారుతున్న మురుగు
- ప్రాంగణమంతా కంపు..కంపు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఆర్టీసీ ఆవరణలో నిలిచి దుర్వాసన వెదజల్లుతున్న మురుగునీరు

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నీరుగారిపోతోంది. ఇందుకు నిదర్శనం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మురుగునీరు పారడంతో ప్రయాణికులు దుర్వాసనను భరించలేకపోతున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తిరుపతి, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల బస్సులు నిలిచే ప్లాట్‌ఫాం వెనుక భాగంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారై మురుగు నీరు ప్రాంగణంలో చేరుతోంది. దీంతో ప్రయాణికులు, వ్యాపారులు, పార్శిల్ విభాగంలో పని చేసే కార్మికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారులు ఉన్నప్పటికీ బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రయాణికులకు బస్టాండ్ ఆవరణలో సరైన వసతులు కూడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ సరిగా పనిచేయకపోవడంతో ఆరు బయటనే మల విసర్జన చేయాల్సిన దుస్థితి. ఇక మూత్రశాలలు మూతబడటంతో ప్రయాణికులు, పరిసర దుకాణాలకు చెందిన, తోపుడు బండ్ల వ్యాపారులు బస్టాండ్‌లోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతోంది. రాబోయే వర్షా కాలంలో డ్రైనేజీ మరింత దుర్భరంగా తయారయ్యే అవకాశముంది. ఆర్టీసీ అధికారులు నిత్యం ప్రాంగణంలో తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. జిల్లాలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొంటున్నప్పటికీ.. బస్టాండ్‌ను పట్టించుకోకపోవడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పారిశుద్ధ్య మెరుగుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



మూతపడిన మరుగుదొడ్లు

మాన్యం కౌలు వేలంలో తగ్గిన ఆదాయం

నంద్యాల(అర్బన్): మేజర్ పంచాయతీ కానాల గ్రామానికి చెందిన 82.43 ఎకరాల ఆలయ భూములకు శనివారం బుగ్గరామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన కౌలు వేలం పాటల్లో రూ.3.05 లక్షలు తగ్గిందని ఆలయ ఈఓ వేణుగోనాథరెడ్డి తెలిపారు. శ్రీ బుగ్గర రామేశ్వరస్వామి, లక్ష్మీచెన్నకేశవ స్వామి, పూదోట లింగావధూత ఆలయం, ఆంజనేయస్వామి దేవస్థానాల భూములకు నిర్వహించిన కౌలు వేలాల్లో 20 మంది డిపాజిట్‌దారులు పాల్గొన్నారు. బహిరంగ వేలాలకు పర్యవేక్షణ అధికారిగా రామాంజనేయశర్మ, ఆలయ చైర్మన్ అనసూయమ్మ వ్యవహరించారు. గత ఏడాది నిర్వహించిన వేలాల్లో రూ.18,88,500 రాగా ఈ ఏడాది రూ.15,83,500 వచ్చిందన్నారు. దీంతో రూ.3.05 లక్షల ఆదాయం తగ్గిందని చెప్పారు. కోవెలకుంట్ల ఈఓ బాలచెంచన్న, ఆలయ అర్చకుడు నాగార్జున శర్మ, సిబ్బంది శివ పాల్గొన్నారు.



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న సయ్యద్ జాకీర్ అహమ్మద్

నంద్యాల(అర్బన్): వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ముస్లిం పర్సనల్ లా బోర్డు స్టేట్ కో కన్వీనర్ సయ్యద్ జాకీర్ అహమ్మద్, నంద్యాల జిల్లా ఇమాంల సంఘం అధ్యక్షుడు అంజాద్‌బాషా డిమాండ్ చేశారు. స్థానిక సాయిబాబానగర్‌లోని కుబ్రా మసీదులో శనివారం నంద్యాల మజ్లిసుల్ ఉలమావల్ ఆయిమ్మా నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇమాంల సంఘం ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం వెనక్కి తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల 25వ తేదీన నిర్వహించే హ్యూమన్ చైన్ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ముస్లింలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. నాయకులు మౌలానా మహబూబ్‌బాషా, మౌలానా అబ్దుల్ మజీద్, అమీద్, జమాతే రఫీ, మహమ్మద్ ఇలియాస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల పునర్విభజన, క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం 19, 20, 21 ఉత్తర్వులు విడుదల చేసిందని, అయితే వీటిల్లో కొత్త ప్రయోగాలుగా ఉన్నాయని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు కోరారు. శనివారం పట్టణంలోని హోలీక్రాస్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబశివుడు, రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరావుతో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోలు అసంబద్ధంగా ఉన్నాయని, ఇందుకు నిరసనగా ఈనెల 21వ తేదీన చేపట్టనున్న ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే 23వ తేదీన అమరావతిలో జరిగే విద్యాభవన్ ముట్టడి కార్యక్రమం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలో 1:20 నిష్పత్తిని అమలు చేయాలని, మోడల్ ప్రైమరీ స్కూల్‌కు సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చి ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని, మూడు సంవత్సరాల పాటు రేషనలైజేషన్ ప్రక్రియ జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉమర్, సుంకన్న, శ్రీరాములు, భాస్కర్, ప్రతాపరెడ్డి, నరసింహులు, గోవిందనాయక్, పోలియో నాయక్, అలీఖాన్ పాల్గొన్నారు.

ఫీజు చెల్లించి అనుమతులు పొందండి

- నంద్యాల ఆర్‌డీఓ చల్లా విశ్వనాథ్



మాట్లాడుతున్న నంద్యాల ఆర్‌డీఓ చల్లా విశ్వనాథ్

చాగలమర్రి: కుడాకు 5శాతం ఫీజు చెల్లించి ఇంటి నిర్మాణానికి ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చని నంద్యాల ఆర్‌డీఓ చల్లా విశ్వనాథ్ తెలిపారు. ఆయన శనివారం మండలంలోని నేలంపాడులో చేపట్టిన భూ రీసర్వే డీఎల్‌ఆర్ డేటా వర్క్‌ను పరిశీలించారు. అనంతరం చాగలమర్రిలోని తహసీల్దారు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల నుంచి చాగలమర్రిలోని ఎన్‌హెచ్-40 వరకు నిర్మించనున్న జాతీయ రహదారికి సేకరించిన మల్లెవేముల గ్రామ రైతులకు(28.74 ఎకరాలు), చాగలమర్రి రైతులకు (5.57 ఎకరాలు) డబ్బు చెల్లించినట్లు తెలిపారు. అదనంగా మల్లెవేముల రైతుల నుంచి 5 ఎకరాలు, చాగలమర్రి రైతుల నుంచి ఎకరం భూమిని సేకరించేందుకు రైతులతో మాట్లాడుతున్నామన్నారు. రస్తా లేని పొలాల రైతులకు తాత్కాలిక రస్తాలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ ఎం.మద్దిలేటి ఉన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

నంద్యాల(న్యూటౌన్): స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సహకారించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ కోరారు. శనివారం డీఆర్‌ఓ ఛాంబర్‌లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేశామని, ఈజాబితాలోని డెత్ ఓటర్లు, చేర్పులు, మార్పులు బూత్ స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు తెలియజేయాలని సూచించారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ 80 సంవత్సరాలు పైబడిన వారికి హోం ఓటింగ్ ఎలా అవకాశం కల్పిస్తారో, అదే రీతిలో గర్భిణులకు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ

నేటి నుంచి వేంకటేశ్వరుడికి పూజలు



విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు నిర్మించిన నూతన బాలాలయం



రుద్రవరం-అప్పనపల్లె దారిలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం (ఇన్‌సెట్) ప్రతిష్ఠించేందుకు సిద్ధంగా స్వామి అమ్మవార్ల పురాతన విగ్రహాలు

రుద్రవరం: మండల పరిధిలోని వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి స్వామి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠోత్సవం, ఆలయ తృతీయ వార్షికోత్సవ పూజలు నిర్వహించనున్నారు. దాదాపు 850 ఏళ్ల క్రితం వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయం వెలిసింది. అప్పట్లో నిత్య పూజలు, శుభకార్యాలతో ఆలయం కళకళలాడేది. అనివార్య కారణాలతో కొన్నేళ్లుగా పూజా కైంకర్యాలు లేక ఆలయం వైభవం కోల్పోయింది. దీంతో ఇటీవల ఆలయాన్ని దాతల సహకారంతో నిర్మించారు. అక్కడ నూతన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి అమ్మవార్లతో పాటు మహ త్రిపుర సుందరి సమేత మానస లింగేశ్వర స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. నాటి నుంచి ఆలయానికి పూర్వ వైభవం వచ్చింది. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వాహనాలు, కాలినడకన భక్తులు స్వామి అమ్మవార్ల సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నూతన ఆలయం నిర్మించే సమయంలో పురాతన స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఓ రేకుల షెడ్డులో కొలువు తీర్చి పూజలందిస్తున్నారు. ఆ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రత్యేకంగా నూతన బాలాలయం నిర్మించారు. ప్రస్తుతం ఆలయం వద్ద తృతీయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించాల్సి ఉండగా వాటితో పాటు బాలాలయంలో పురాతన విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు నిర్వాహకులు మధుసూదనరెడ్డి, రంగనాయకులు, కానాల నరసింహులు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా 18న వివిధ పూజాలు, హోమాలు, 19న విగ్రహాల ప్రతిష్ఠోత్సవం ఉంటుందని తెలిపారు. స్వామి అమ్మవార్లకు అభిషేక పూజ, కల్యాణోత్సవం, పల్లకీ సేవ నిర్వహించనున్నారు.

పచ్చదనం పెంపొందించండి



రుద్రవరంలో మొక్క నాటుతున్న దృశ్యం



అల్లూరులో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

రుద్రవరం: మొక్కలు నాటి వాటిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు ప్రజలకు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం ఆయన ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యాలవాడ: వేసవిలో అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అల్లూరు గ్రామంలో అధికారులు, పొదుపు మహిళలు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రాణకోటి జీవనాధారానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహిమాన్, వెలుగు సీసీ గంగన్న పాల్గొన్నారు.

- చాగలమర్రి: స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం 2వ సచివాలయంలో ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడంపై అధికారులు అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి ఓబులేసు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్.. మజ్జిగను పంపిణీ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సచివాలయ ఆవరణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ తొలసమ్మ, తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ అనురాధ, ఏఓ రంగనేతాజీ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యం

ఆళ్లగడ్డ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యమని జిల్లా జేసీ విష్ణుచరన్ అన్నారు. 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం శిరివెళ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి ఫరూక్



అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఓ రాము నాయక్

నంద్యాల(న్యూటౌన్): మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలని న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ షాదీఖానా సమీపంలో ఉన్న ఫిల్టర్ బెడ్ పంప్ హౌస్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పంప్ హౌస్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఎన్టీఆర్ షాదీఖానా చైర్మన్ అక్బర్ బాషా, పల్లె వెంకటసుబ్బయ్య, పబ్బతి వేణు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ ఎంఈ గుర్రప్ప, ఏఈలు, డీఈలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ పరిసరాలను శుభ్రంగా ఉంచండి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రవికుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

- గోస్పాడు: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో శనివారం మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వడదెబ్బ నుంచి కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను, మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే మొక్కలు నాటారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరి స్వామి గంధం



గంధం ఊరేగింపు దృశ్యం



ఎద్దు యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండల కేంద్రం సమీపంలో వెలసిన దస్తగిరి స్వామి గంధం, ఉరుసు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి పాత బస్టాండు వీధిలోని ముల్లా మౌలాలి ఇంటి నుంచి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పీఠాధిపతి అబ్దుల్‌హక్ శిశ్య బృందం ఆధ్వర్యంలో స్వామి వారికి గంధాన్ని ఊరేగింపుగా దర్గా వరకు తీసుకొచ్చారు. స్వామి వారికి గంధం సమర్పించి, ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. శెట్టివీడు, చాగలమర్రికి చెందిన దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విజేతలకు బహుమతులు

దస్తగిరి స్వామి ఉరుసును పురస్కరించుకుని శనివారం ఒంటెద్దు బండ లాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం 22 ఎద్దులు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన దస్తగిరి ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచి రూ.15,000 నగదు బహుమతి కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో కోటకందుకూరు పెద్ద గురువయ్య, చెన్న కేశవ ఎద్దులు సంయుక్త విజేతలుగా నిలిచి రూ.12,000, మూడవ స్థానంలో నిలిచిన మైదుకూరు నరసింహారెడ్డి ఎద్దు రూ.10,000 నగదును దక్కించుకున్నాయి. వీటితో పాటు వరుసుగా పది స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

పిడుగు పాటుకు చెట్టు ధ్వంసం

ఆళ్లగడ్డ: మండల కేంద్రం శిరివెళ్లలో పిడుగు పాటుకు ఓ చెట్టు ధ్వంసమైంది. శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి ప్రతాప్ ఇంటి సమీపంలోని దాదాపు 50 ఏళ్ల చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు నిలువునా చీలి నేలకొరిగింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు